

## కాప్రా సర్కిల్‌లో పర్యటించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం

**కాప్రా, ఫిబ్రవరి 25 (జనంవార్త) :** కాప్రా సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఓల్డ్ కాప్రా, డాబా గార్డెన్,సాకేత్ రోడ్డు,ఎల్లారెడ్డిగూడ పలు ప్రాంతాలలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సాధించాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ కాలనీలలో ప్రతి ఇంటి నుండి చెత్తను తప్పనిసరిగా సేకరించాలన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా,స్వచ్ఛ ఆటోలకు మాత్రమే అప్పగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## కెపిహెచ్‌బి కాలనీ సర్వీస్ రోడ్‌లో ఆక్రమణలు తొలగించాలని డిజిపి వినతి

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 25, (జనం వార్త) :** కూకట్‌పల్లి నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ను కూకట్ పల్లి నియోజకవర్గం బిజెపి ఇన్ ఛార్జ్ మాధవరం కాంతారావు కలిసి విన్నవించారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్ర రావు ఆధ్వర్యంలో కాంతారావు రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ను కలిసి పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెపిహెచ్ బి కాలనీ సర్వీస్ రోడ్ లో రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. దేవాలయాల ప్రహరీ గోడలకు ఆనుకొని హలీం సెంటర్ల ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెపిహెచ్ బి కాలనీ మూడవ ఫేస్ లో పార్కులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయని ఫిర్యాదు చేశామన్నాను. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చెర్లపల్లి పీఏసీలో ఆయుర్వేద గ్రామం, కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్ ప్రారంభం

**ఉప్పల్ :** ఖైదీల సంక్షేమం, పునరావాసం, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా చెర్లపల్లి ఖైదీల వ్యవసాయ కాలనీ (పీఏసీ)లో ఆయుర్వేద గ్రామం, కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమాన్ని డా. సౌమ్య మిశ్రా ప్రారంభించారు. ఆరు సంవత్సరాల విరామం అనంతరం పీఏసీలో ఆయుర్వేద గ్రామాన్ని పునఃప్రారంభించారు. జైలు శాఖ ఆధ్వర్యంలో ఇది రెండో ఆయుర్వేద గ్రామం. మొదటిది సికాలో ప్రారంభమై విజయవంతంగా కొనసాగుతోంది. జైలు పరిశ్రమల చరిత్రలో తొలిసారిగా ఏర్పాటు చేసిన కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్ కూడా ఇదే సందర్భంలో ప్రారంభమైంది. ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, విడుదల అనంతరం స్వయం ఉపాధికి దారి చూపడం ఈ యూనిట్ లక్ష్యం. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేద గ్రామం తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించే మోడల్ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని తెలిపారు. అసలైన ఆయుర్వేద చికిత్సలు, థెరపీలు నామమాత్రపు చార్జీలతో అందుబాటులో ఉంటాయని చెప్పారు. దీని ద్వారా జైలు వ్యవస్థ, సమాజం మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఖైదీలకు అర్హత కలిగిన నిపుణుల పర్యవేక్షణలో ఆయుర్వేద చికిత్సలు, వెల్‌నెస్ సేవలపై వ్యవస్థీకృత శిక్షణ అందించనున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫైడ్ నైపుణ్యాలు సాధించి విడుదల తర్వాత ఉపాధి అవకాశాలు పొందే విధంగా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులు, శిక్షణ పొందిన థెరపిస్టులు కేంద్రంలో సేవలు అందిస్తున్నారు. కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్‌లో సంప్రదాయ పద్ధతిలో, రసాయనాలు లేకుండా నూనెల తయారీ జరుగుతుంది. అధిక ఉష్ణోగ్రతలు వినియోగించకుం డా తయారు చేయడం వల్ల పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, అవసరమైన కొవ్వు ఆమ్లాలు నిల్వ ఉంటాయి. ఆరోగ్య చైతన్యం పెరుగుతున్న నేపథ్యంలో కోల్డ్ ప్రెస్ నూనెలకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతున్నది. ఈ యూనిట్ ద్వారా ఖైదీలకు నూనెల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, పరిశుభ్రత నిర్వహణ, నాణ్యత నియంత్రణ అంశాల్లో ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాల్లో అవకాశాలు విస్తరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా జైలు శాఖలో సంస్కరణలు, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, స్వయం సమృద్ధి, అర్థవంతమైన పునరావాసంపై ప్రభుత్వం చూపుతున్న దృష్టి స్పష్టమవుతోంది. కార్యక్రమంలో డీఐజీ హైదరాబాద్ రేంజ్ డా. డి. శ్రీనివాస్, డీఐజీ వరంగల్ రేంజ్ ఎం. సంపత్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎస్.ఎం. ఖాలిద్ అక్తర్, పీఏసీ చెర్లపల్లి సూపరింటెండెంట్ డి. భారత్, సీపీ చెర్లపల్లి సూపరింటెండెంట్ జి. ప్రమోద్, ఆయుర్వేద వైద్యులు డా. వై.బి. రమేష్, డా. ఎం. గౌతమ్, డీఎస్ జైల్స్ డి. కాళిదాస్, కె. శ్రీమన్ రెడ్డి పాల్గొన్నారు.

# పతనమైన టమాటా ధర

- బహిరంగ మార్కెట్లో 15 నుంచి 20 వరకు అమ్మకాలు
- కర్ణాటక ఏపీ నుండి పంట దిగుబడి చేయించుకుంటున్న వ్యాపారులు



**రంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 25 :** టమాటా రేట్లు పడిపోయాయి. గత రెండు వారాలుగా మార్కెట్లో వీటి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. మొన్నటి వరకు కిలో 20 వరకు పలకగా ప్రస్తుతం ఐదు రూపాయలకు పడిపోయింది. ఈ ధర రైతుకు గిట్టుబాటు కాక తెచ్చిన సరుకులు ఇంటికి తీసుకు వెళ్లలేక వచ్చిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

### ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి దిగుమతి

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, మదనపల్లె కర్ణాటకలోని రాయచూర్, బెంగుళూరు ప్రాంతాలలో ఈ సీజన్లో టమాట సాగు ఎక్కువగా జరిగింది. ఈ ఏడాది వర్షాలు వాతావరణం అనుకూలంగా ఉండడంతో అక్కడ టమాటా దిగుబడులు ఆశించిన దాని కన్నా రెట్టింపుగా వచ్చాయి. ఈ క్రమంలో రైతులు పెద్ద మొత్తంలో పంటను మార్కెట్లకు తెస్తూ ఉ ండడంతో రేట్లు ఒక్కసారిగా పడిపోయాయి. దీనితో ఈ ప్రభావం తెలంగాణ పై పడింది. ఇక్కడి హోల్సేల్ మార్కెట్లో హైబ్రిడ్ రకానికి చెందిన టమాటా5 నుండి 6 వరకు లోకల్ టమాట 2 నుంచి 3 వరకు దొరుకుతూ ఉండడంతో తెలంగాణ రైతులు అక్కడి పంటను దిగుమతి చేసుకుంటున్నారు ఈ క్రమంలో స్థానికంగా సాగు అయిన పంటకు డిమాండ్ పడిపోయింది. దీనికి తోడు వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ కర్ణాటక నుంచి హైబ్రిడ్ రకం టమాటాను దిగుమతి చేసుకుంటూ ఉండడంతో లోకల్ టమాట ఎవరూ కొనడం లేదు.

### 70 రూపాయలకే 25 కిలోల బాక్స్

రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్, యాచారం మహేశ్వరం చేవెళ్ల మండలాలలో టమాట అధికంగా పండింది. నవంబర్లో టమాటా పెట్టుకోగా అదే నెల చివరి లో నాట్లు వేశారు దీని పంట కాలం 70 రోజులుగా ప్రస్తుతం క్రాప్ ప్రారంభం అయ్యింది. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో ఇక్కడ ఆశించిన స్థాయి కంటే దిగుబడులు అధికంగా వస్తున్నాయి. యాచారం ఇబ్రహీంపట్నం మార్కెట్లలో మంగళవారం ఒక్క బాక్స్ (25 కిలోలు) వ్యాపారులు 70 రూపాయలకే కొనుగోలు చేశారు ఈ ధరలు రైతుకు గిట్టుబాటు కావడం లేదు కనీసం రవాణా చార్జీలు సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం 15 నుంచి 20 రూపాయలు చెల్లిస్తే గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు.

### ఓపెన్ మార్కెట్లో అధిక ధరలు

హోల్సేల్ రైతుల నుంచి పంటను తక్కువ ధరకుకుంటున్న వ్యాపారులు అదే పంటను రిటైల్ వ్యాపారులు డబల్ రేటుకు అమ్ముతున్నారు. క్వింటాల్ లెక్కన రిటైల్ వ్యాపారులు కొంటూ ఉండటంతో వారికి కిలో టమాట పది రూపాయల వరకు పడుతుంది దీనితో వారు బహిరంగ మార్కెట్లో 15 నుంచి 20 రూపాయల వరకు అమ్ముతున్నారు ఆయా ప్రాంతాలలో జరిగిన సంతలలో 18 వరకు కిలో చొప్పున అమ్మకాలు కొనసాగిస్తున్నారు కానీ రైతులకు మాత్రం కిలోపు అతి తక్కువ ధర చెల్లిస్తున్నారు.

## మధుకర్ స్మారక సేవా సమితి భవన నిర్మాణానికి శంకుస్థాపన

### కార్యాలయం అందుబాటులో ఉంటే మరిన్ని సేవా కార్యక్రమాలు



**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 25, (జనం వార్త) :** కెపిహెచ్ బి కాలనీ నాలుగవ ఫేజ్ లో మధుకర్ స్మారక సేవా సమితి కార్యాలయ భవన శంకుస్థాపన మహోత్సవాన్ని స్థానిక బిజెపి నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్యాలయం భవన నిర్మాణానికి పూజా కార్యక్రమాలు నిర్వ హించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మధుకర్ స్మారక సేవా సమితి కార్యాలయం స్థానికంగా లేనప్పటికీ ఇప్పటివరకు ప్రతి సంవత్సరం నిరుపేద ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలను చేపట్టమన్నారు. సేవా సమితి కార్యాలయం స్థానికంగా ఉంటే నిరుపేద ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి మరింత అవకాశం ఉంటుందన్నారు. ఈ సేవాసమితి ఆధ్వర్యంలో నిరుపేదల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కృష్ణ రాజు, రమేష్, వైకుంఠం, కామేశ్వరరావు, తోట నరేష్, అమర్నాథ్, హనుమాన్, హరిదార్,అయ్యన్న,మహేష్, భారతీయ జనతా పార్టీ డివిజన్ కన్వీనర్ గురు ప్రసాద్,మేడ్చల్ మల్కాజ్గిరి అర్బన్ జిల్లా 11 సంవత్సరాలు సుపరిపాలన జాయింట్ కన్వీనర్ నర్వ పవన్, జిల్లా అధికార ప్రతినిధి తోట రమేష్, సెన్సార్ బోర్డు నెంబర్ రేవతి, మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగలక్ష్మి, జనరల్ సెక్రెటరీ అనూష, శిరీష గిరిధర్ రెడ్డి, స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ మను చౌదరి

### మొదట రోజు పరీక్ష ప్రశాంతమన్న డీ.ఐ.ఈ.వో కిషన్

**మేడ్చల్ :** ఇంటర్ పరీక్షలు నిన్న బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. జిల్లాలోని శామీర్ పేట్ మండలం తూంకుంటలోని సాయితేజ జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీ, ఉప్పర్ పల్లిలోని ఎక్సెలెన్సియా జూనియర్ కాలేజీలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహాణను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. పరీక్షలు జరుగుతున్న తరగతి గదులలో కలెక్టర్ ప్రత్యక్షంగా విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. పరీక్షా హాల్లో విద్యార్థులకు అవసరమైన మంచినీరు, లైట్లు, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు ఉన్నాయా అని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఒక పరీక్షా కేంద్రంలో ఎంత మంది పరీక్ష రాస్తున్నారని, అలాగే ఎంత మంది గైరాజరయ్యారని ప్రశ్నించారు. సీ.సీ కెమెరాలు పని చేస్తున్నాయా అని, అలాగే సీ.సీ కెమెరాల డిస్ ప్లే రూం నుండి ప్రతి పరీక్ష గదిని పరిశీలించారు. పరీక్షా పత్రాలను ఏ సమయానికి ఓపెన్ చేశారని, పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా విద్యార్థులను పరీక్ష హాల్ లోనికి అనుమతించారా..? అని కాలేజీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్, శామీర్ పేట్ మండల తహసీల్దారు సుచరిత, తదితరులున్నారు.

**మొదటి రోజు పరీక్ష ప్రశాంతం:**

నిన్నటి నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పరీక్షలలో భాగంగా, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో మొదటి రోజు పరీక్ష సెకండ్ ల్యాంగ్వేజ్ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్ తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 70,268 మంది విద్యార్థులు హాజర్ కావాల్సి ఉండగా, 68,169 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మొదటి పరీక్షకు 2,099 మంది విద్యార్థులు గైరుహాజరైనారని కూడా ఆయన వెల్లడించారు. ఈ పరీక్షలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, జిల్లా మొత్తంగా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీ.ఐ.ఈ.వో పేర్కొన్నారు.

# పెండింగ్ పనులు పూర్తి చేయించండి

- మేడిపల్లి సాయి హిల్స్ కాలనీలో డిప్యూటీ కమిషనర్ పర్యటన
- పనులు పూర్తి చేయించాలని కోరిన మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి



**మేడిపల్లి :** సాయి హిల్స్ కాలనీలో అసంపూర్తి పనులను పూర్తి చేయించాలని మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి అధికారులను కోరారు. మల్కాజిగిరి మున్సిప ల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి సాయి హిల్స్ కాలనీలో గతంలో సీసీ రోడ్డు పనులు నిలిచిపోయిన విషయాన్ని అధికారులకు తెలియజేశారు. పీర్జాదిగూడ మున్సి పల్ కార్పొరేషన్ జిహెచ్ఎంసి లో విలీనం కావడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయని హరి శంకర్ రెడ్డి అధికారులకు వివ రించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి బుధవారం బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ శైలజ, సాయినాథ్ గౌడ్ లతో కలిసి సాయి హిల్స్ కాలనీలో పర్యటించారు. ఈ పర్యటనలో పెండింగ్ పనులను త్వరగా ప్రారంభిచాలని కోరారు. డిప్యూటీ కమీషనర్ ఏ. శైలజ సానుకూలంగా స్పందించినట్లుగా హరి శంకర్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి

### మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా

**జవహర్ నగర్ :** జవహర్ నగర్ లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ‘ఆణిముత్యాల’ పేరిట ఒక్కొక్కరికి పదివేల రూపాయల నగదును అందజేస్తానని జవహర్ నగర్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా తెలిపారు. బుధవారం జవహర్ నగర్ లోని ప్రభుత్వ పాఠశాలలో 150 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ ను ఆయన అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రెడ్డి శెట్టి మహేష్ గుప్తా, కోట శ్రీనాథ్ గుప్తా, గడ్డమీది విజయ్, నయీమ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

